క్లుప్తంగా

పాపన్న గౌడ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర

సంగారెడ్డి: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 315వ వర్ధంతి సందర్భంగా బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సురేందర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

నారాయణఖేడ్: అర్హులంతా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ అశోక చక్రవర్తి సూచించారు. బుధవారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం–2025లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటర్లుగా నమోదు కావాలన్నారు. అందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, కళాశాలల్లోనూ అవగాహన కల్పిస్తామన్నారు. రాజకీయ పార్టీలు సైతం సహకరించాలని కోరారు. స్థానిక తహసీల్దార్ భాస్కర్, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ల ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: ప్రాంతీయ ఆస్పత్రిలో గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు, రక్తనిల్వ కేంద్రంలో పనిచేయడానికి ఎంబీబీఎస్ వైద్యుడి అవసరం ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రమేష్ తెలిపారు. ఆస్పత్రిలో 33 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఈ మధ్యే ఉన్నత చదువులు, ఇతర కారణాలతో 11 మంది రాజీనామా చేశారని చెప్పారు. అందువల్ల సేవలకు విఘాతం కలుగకుండా గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు, రక్తనిల్వ కేంద్రంలో ఎంబీబీఎస్ వైద్యుడి అవసరం ఉందన్నారు. అర్హత, ఆసక్తిగల వారు దరఖాస్తుతో తనను సంప్రదించాలని సూచించారు. లేదా సంగారెడ్డిలో డీసీహెచ్‌ఎస్‌కు కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్ గ్రామంలో బుధవారం సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌లపై హద్నూర్ పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ నేరస్థులు ఫోన్ చేసి బ్యాంక్, వ్యక్తి వివరాలు అడిగితే చెప్పవద్దని, ఆన్‌లైన్ గేమ్‌లు ఆడడంతో పాటు బెట్టింగ్‌ల జోలికి పోయి నష్టపోవద్దని పోలీసులు సేవాలాల్, శ్యామయ్య ప్రజలకు సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని తెలిపారు.

హెచ్‌ఎం రామకృష్ణకు అభినందనలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఇటీవల డాక్టరేట్ స్వీకరించిన మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణను బుధవారం ఎంఈఓ శంకర్ అభినందించారు. 2024– 25 సంవత్సరానికి రామకృష్ణను ఎన్సీఆర్టీ బెస్ట్ ప్రాక్టీస్ పాఠశాల హెచ్‌ఎంగా ఎంపిక చేసినందుకు, పాఠశాలలో వివిధ రకాల వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తూ ప్రైవేట్‌కు దీటుగా బడులను తీర్చిదిద్దాలన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉపాధి కూలీలకు రెండు నెలల బకాయిలను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వెంకటాపూర్ శివారులో కూలీలు పని చేస్తున్న ప్రదేశం వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించి రోజుకు రూ.600లు వేతనం ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలల వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పద్మమ్మ, మధు, సుభాష్, అంజయ్య, గాలయ్య, వీరన్న, కిష్టయ్య, మహేందర్, శ్రీనివాస్, రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం.. ప్రారంభానికి దూరం

- జిన్నారంలో రూ.1.56 కోట్లతో ఆస్పత్రి భవన నిర్మాణం
- పూర్తయిన 80 శాతం పనులు
- ఫ్లోరింగ్, సెప్టిక్ ట్యాంక్ పైప్‌లైన్ నిర్మాణంలో జాప్యం
- వైద్య సేవలకు ప్రజల ఎదురుచూపులు



ప్రారంభానికి నోచుకోని నూతన భవనం

ప్రభుత్వాలు ఏ పనిని మొదలు పెట్టినా సకాలంలో పూర్తి చేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన దాఖలాలు లేవు. జిన్నారం మండలంలోని నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రం భవనాన్ని నిర్మించి నెలలు గడుస్తున్నా.. ప్రారంభించి వినియోగంలోకి తీసురావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనాన్ని ప్రారంభించి.. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు..

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్య సేవలుదించాలని ఉద్దేశంతో మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు.. ఆరోగ్య సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం కోటి 56 లక్షలు వెచ్చించి నూతన భవనాన్ని నిర్మించింది. భవన నిర్మాణం జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నా.. ప్రారంభోత్సవానికి మాత్ర నోచుకోవడం లేదు. పాత భవనం శిధిలావస్థకు చేరడంతో నూతన భవన ఏర్పాటుకు పూనుకొని పూర్తి చేశారు. భవనంలో అధునాతన గదుల నిర్మాణం చేపట్టారు. భవనం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని మండల ప్రజలు ఎదురుచూపులు చూస్తున్నారు. భవనం అందుబాటులోకి వస్తే పేదలకు మరిన్ని నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. భవనం సమీపంలో పెద్దపెద్ద బండ రాళ్లను తొలగించకుండా అలాగే వదిలేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నూతన భవనం చుట్టూ ఉన్న పరిసరాలను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు కొత్త భవనంలో వైద్య సేవలు ఎప్పుడు అందుతాయో అని వేచి చూస్తున్నారు.

> **నిధులు మంజూరైతే మిగిలిన పనులు పూర్తి చేస్తాం**
>
> మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనం దాదాపు నిర్మాణం పూర్తయింది. భవనంలో ఫ్లోరింగ్, సెప్టిక్ ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణ పనులకు సంబంధించి రూ.16 లక్షల మంజూరుకు ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తి చేశాం. నిధులు మంజూరు కాగానే మిగిలిన పనులను పూర్తి చేసి భవనాన్ని ప్రారంభిస్తాం.
>
> – మల్లేష్ , ఏఈపీఆర్ జిన్నారం

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

కాంగ్రెస్ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న గిరిధర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం 'జై బాపు, జై భీం, జై సంవిధానం' పేరిట పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తెలంగాణ సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్, నిర్మలారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని అణగదొక్కాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ర్యాలీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మహదేవుపల్లి, దేవునిపల్లిలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. జై బాబు– జై భీమ్– జై సంవిధాన్ నినాదంతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోచయ్య, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని బుధవారం కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు డివిజన్ సమస్యలను వివరించారు. గాంధీ థీమ్ పార్క్, పక్కనే ఉన్నా ట్రయాంగిల్ బిట్‌ను 2021లో జీహెచ్‌ఎంసీ రూ. 3 కోట్ల నిధులను వెచ్చించి నిర్మించారు. అయితే ఇటీవల కాలంలో పార్కు నిర్వహణ లోపం వల్ల వాటర్ ఫౌంటేన్ రావడం లేదని, విద్యుత్ దీపాలు కూడా వెలగడం లేదని వివరించినట్లు తెలిపారు. అలాగే, జేపీకాలనీలో నూతన సీసీ రోడ్డు, డివిజన్‌లోని యాదవ సంఘం స్మశాన వాటిక వద్ద అప్రోచ్ రోడ్డు , చితిమండపాల చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరినట్లు వివరించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం శ్రీరామ్‌నగర్‌కాలనీలో అమేదా ఆస్పత్రి నుంచి పద్మావతి అపార్ట్‌మెంట్ వరకు మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుందని.. మిషన్‌భగీరథ నీరు సరిగ్గా రావడం లేదని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కార్పొరేటర్ కాలనీకి చేరుకుని రోడ్డుపై డ్రైనేజీ నీరు నిల్వకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ఆదేశించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



ప్రసాద్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మంచి నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఫోరం ఫర్ బేటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ షేక్ పాషా, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా సంగారెడ్డి మున్సిపాలిటీలో మంచి నీటి సరఫరా నిలిచి పోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పనుల కోసం వెళ్లే వారు, సామాన్య మధ్య తరగతి ప్రజలు రోజుల తరబడి నీటి సరఫరా కోసం ఎదురుచూస్తున్నారని వాపోయారు. వెంటనే మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కంచాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి అమిది పురం మహేష్‌కుమార్, సహా కార్యదర్శి పాండు రంగం, నాయకులు రాజు మార్కుంది, షఫీ పాల్గొన్నారు.

నియోజకవర్గ బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్‌గా ఆదర్శ్ రెడ్డి



పటాన్‌చెరు: రామచంద్రాపురం సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డిని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్‌గా పార్టీ అధిష్టానం నియమించింది. బుధవారం ఎర్రవల్లి ఫాంహౌస్‌లో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆదర్శ్‌రెడ్డిని కోఆర్డినేటర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి వ్యాపారం

ఐదు టిప్పర్లు సీజ్.. వ్యక్తులపై కేసు నమోదు



పోలీసుల అదుపులో అక్రమ మట్టి టిప్పర్లు

జిన్నారం (పటాన్‌చెరు): అనుమతులు లేకుండా వెంచర్లకు మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారంలో కొందరు బడా నాయకులు వాళ్లా చట్టానికి తూట్లు పొడుస్తూ జోరుగా మట్టి వ్యాపారం సాగిస్తున్నారన్న ఫిర్యాదులపై పోలీసులు స్పందించారు. గ్రామ సమీపంలోని వెంచర్‌కు విచ్చలవిడిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఐడీపీఎల్ నుంచి అన్నారానికి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. పోలీసులు తనిఖీలు నిర్వహించి, ఐదు టిప్పర్లను అదుపులోకి తీసుకొని సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మళ్లీ నిలిచిపోయిన నీటి సరఫరా



చాల్కి ఫిల్టర్ బెడ్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మిషన్ భగీరథ పథకం కార్మికులు మళ్లీ ఆందోళన బాట పట్టారు. తమకు చెల్లించాల్సిన 8 నెలల వేతనాలు చెల్లించడం లేదంటూ రెండు రోజుల నుంచి ఆందోళనకు దిగారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు అవవస్థలు పడుతున్నారు. మూడు నెలల క్రితం కార్మికులు ఆందోళనకు దిగగా అధికారులు వారితో చర్చలు జరిపి జీతాలు త్వరలో చెల్లిస్తామని చెప్పడంతో వారు అప్పట్లో ఆందోళన విరమించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో కార్మికులు మళ్లీ ఆందోళన బాటపట్టారు. న్యాల్‌కల్ మండలంలోని 39 గ్రామాలతో పాటు తండాలు, ఝరాసంగం మండలంలోని 36గ్రామాలు, తండాలకు చాల్కి ఫిల్టర్ బెడ్ ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతుంది. కార్మికులు ఆందోళనకు దిగడంతో రెండు రోజులుగా ఆయా గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. అసలే వేసవి కాలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆందోళన చేసినప్పుడల్లా జీతాలు చెల్లిస్తామని చెప్తూ నెలలు గడిచినా అసలు పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్

కల్హేర్(నారాయణఖేడ్): సమాజాన్ని తీర్చిదిద్దెందుకు ఉపాధ్యాయ వృత్తి గొప్పదని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని ఫత్తేపూర్ పాఠశాల ఉపాధ్యాయులు బి.సంగయ్య పదవీ విరమణ సభ మహాదేవుపల్లి శివారులోని వెంకటాద్రి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. సంగయ్య దంపతులను ఘనంగా సన్మానం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా వారికి జరిమానా విధించారు.

కబడ్డీ క్రీడాకారుడికి అభినందన



ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కలిసిన అర్జున్

పటాన్‌చెరు: కబడ్డీ క్రీడాపోటీలో అద్భుతమైన ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి శిక్షణకు ఎంపికైన కబడ్డీ క్రీడాకారుడిని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అభినందించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీకి చెందిన సారా అర్జున్ ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించి..రాష్ట్ర స్థాయి కబడ్డీ కబడ్డీ శిక్షణకు ఎంపికయ్యారు. తన విజయానికి సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని యువక్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారుడు పండు, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీపోటీలు



కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

నారాయణఖేడ్: డివిజన్‌లోని పలు గ్రామాల్లో బుధవారం కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. మండలంలోని హన్మంత్‌రావుపేట్‌లో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు, నిజాంపేట్ మండలం శాఖాపూర్‌లో పోచమ్మ జాతర సందర్భంగా కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు తలపడ్డారు. నిర్వాహకులు కుస్తీపోటీల స్థాయిని బట్టి కొబ్బరికాయ బహుమతి నుంచి రూ.500ల వరకు బహుమతులు ఇచ్చారు. చివరి బహుమతిగా వెండి కడియాలను అందజేశారు. ఎండలను సైతం లెక్క చేయకుండా మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. పోటీలను తిలకించేందుకు జనాలు భారీఎత్తున తరలివచ్చారు.

కుస్తీమే సవాల్..

కంగ్టి(నారాయణఖేడ్): బారడి పోచమ్మ 33వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం కుస్తీ పోటీలు హోరాహోరీగా నిర్వహించారు. కంగ్టి మండలంలోని బాన్సువాడలో తలపడిన పహిల్వాన్‌లు ఒకరికి మించిన ఒకరు కుస్తీల్లో ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించారు. రూ.50లతో ప్రారంభమైన కుస్తీపోటీలు రూ.1500ల వరకు నిర్వహించారు. చివరి కుస్తీలో నాసిక్‌కు చెందిన సురేష్ పాటిల్‌తో కామారెడ్డి జిల్లా గోద్మేగాంకు చెందిన దత్తాత్రేయ తలపడగా దత్తాత్రేయ విజయం సాధించి 5 తులాల వెండి కడియం గెలుపొందాడు.

సంక్షిప్త వార్తలు

◆ **రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం**

జోగిపేట(అందోల్): జోగిపేటలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అశోక్‌కుమార్, పీఆర్ ఏఈ మొగులయ్యను బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ రాజేశ్ కుమార్, ఎంపీఓ, ఈజీఎస్ సిబ్బంది శాలువా, పూలదండలతో సత్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఏఈ మొగులయ్య, కార్యాలయ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌లు మండలంలో మంచి సేవలను అందించారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు చేసిన సేవలు గుర్తుండి పోతాయన్నారు.

◆ **దైవచింతనతో మానసిక ప్రశాంతత**

పటాన్‌చెరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలం పరిధి కర్దనూర్‌లో ఎల్లమ్మతల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించారు.

◆ **తప్పులు లేని ఓటరు నమోదు సహకారం**

పటాన్‌చెరు టౌన్: తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని పటాన్‌చెరు సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ రంగారావు అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులకు బుధవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో 18 ఏళ్లు నిండిన నూతన ఓటర్లు, మృతిచెందిన వారి పేర్ల తొలగింపు, తప్పుల సవరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమీక్షించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక బూతు లెవల్ సహాయకులను నియమించాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, బీజేపీ నేతలు ఉన్నారు.

◆ **నీటి ఎద్దడిని తీర్చండి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్‌లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని బుధవారం మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఏదైనా సమస్యతో మిషన్ భగీరథ నీళ్లు రానప్పుడు గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలోని బోర్ల సహాయంతో ట్యాంకులను నింపాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు నరేష్‌గౌడ్, నగేష్, బాబూజీ, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



న్యాల్‌కల్(జహీరాబాద్): సన్నబియ్యం పంపిణీ చేసి స్వీట్లు పంచుకున్న నాయకులు



సంగారెడ్డి జోన్: బియ్యం పంపిణీ చేస్తున్న నిర్మలారెడ్డి, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

పటాన్‌చెరు: పేదవాడి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రేషన్ దుకాణంలో ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

◆ **డప్పూర్ గ్రామంలో..**

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్రం సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని డప్పూర్ గ్రామంలో తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆర్డీఓ రాంరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రేషన్‌కార్డు దారులకు దొడ్డుబియ్యం పంపిణీ చేస్తే వాటిని అమ్ముకునే వారన్నారు. ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకే సన్న బియ్యం పథకాన్ని తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, కిరణ్‌గౌడ్, సయ్యద్ షకీల్ పాల్గొన్నారు.

◆ **పేదలకు వరం సన్నబియ్యం పథకం**

జహీరాబాద్: సన్నబియ్యం పథకం పేదలకు వరంలాంటిందని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో సెట్విన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, ఆర్డీఓ రాంరెడ్డిలు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలశంకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **నాణ్యమైన బియ్యం పంపిణీ**

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామంలో బుధవారం ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆర్డీఓ రాంరెడ్డి, తెలంగాణ సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. పథకం అమలులో అక్రమాలు సహించమన్నారు.

◆ **సన్నరకం బియ్యం ఘనత రేవంత్‌దే**

సంగారెడ్డి జోన్: అర్హులైన రేషన్ కార్డు ఉన్న నిరుపేదలందరికీ సన్నబియ్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి పట్టణంలోని 28వ వార్డులోని చౌక ధరల దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

◆ **అర్హులందరికీ ఇవ్వాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అర్హులందరూ సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణదారులు అర్హులందరికీ సన్నబియ్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పుష్ప, సింధూరెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, ఆర్‌ఐ శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

◆ **ధర్మాపూర్ గ్రామంలో..**

రాయికోడ్(అందోల్): ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు శాంత్‌కుమార్ పాటిల్ అన్నారు. మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి బుధవారం రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించి.. లబ్ధిదారులకు అందజేశారు.